అపురూపం..



దేశ రక్షణకేగిన ధీరుడా..

తుపాకి గుండ్లకు ఎదురెళ్లిన వీరుడా..

ఉగ్రమూకలను చండాడిన యోధుడా..

ఎక్కడికెళ్తావ్.. నువ్వెక్కడికెళ్తావ్..

నీ కోసం వచ్చిన వేలాది గుండెల్లో..

నీ విజయంతో స్ఫూర్తిపొందిన అందరి హృదయాల్లో..

భూమి భారతిలో నీ పోరాటం అమరం..

త్రివర్ణ రెపరెపల్లో నీరూపం శాశ్వతం..

అమ్మనాన్నలకే కాదు.. కోట్ల మందికి నీవు అపురూపం..



గోరంట్ల మండలం కళ్లి తండాలో ఆదివారం అగ్నివీర్ వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల అనంతరం పార్థివదేహంపై కప్పిన జాతీయ పతాకాన్ని ఆయన తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతీబాయికి సైనికాధికారి అందించారు. ఆ పతాకాన్ని అందుకున్న తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి విజయాన్ని తలచుకుని తండ్రి గర్వంతో సైనికాధికారికి సెల్యూట్ చేశారు. -హిందూపురం (ఆంధ్రజ్యోతి)

బోసిపోయిన కళ్లి తండాలోని వీధి



నిశ్శబ్దం..

బోసిపోయిన కళ్లి తండా వీధులు

- ఎవరి పనుల్లో వారు నిమగ్నం
- అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి అధికారుల ఏర్పాట్లు
- రెండురోజుల్లో తండా పేరు మార్పుపై నివేదిక

(7లో..)

వైభవంగా మల్లెపూలోత్సవం

కదిరి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి మద్దిలేరు వద్ద ఉన్న మండపంలో సోమవారం మల్లెపూలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామికి నిత్యపూజలు, కైంకర్యాలు చేశారు. అనంతరం సాయంత్రం తిరువీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహించే మల్లెపూలోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కదిరి కుంకుమ, గాజులు, మల్లెలకు ప్రత్యేక స్థానం ఉంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



మల్లెపూలోత్సవంలో స్వామివారు..

కొత్త స్కూళ్లు.. సరికొత్త సవాళ్లు!

జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రెండు నెలలుగా విద్యాశాఖ కసరత్తు

చివరి దశకు

పాఠశాలల పునర్నిర్మాణం

తగ్గనున్న యూపీ స్కూళ్లు

ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన

6

ఉద్యోగ కల్పనే చంద్రబాబు ధ్యేయం

నేడు పెనుకొండలో మెగా జాబ్‌మేళా

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



పెనుకొండ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ సమీపంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో మంగళవారం జరిగే మెగాజాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 60 కంపెనీలు పాల్గొంటాయని, దాదాపు రెండువేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జాబ్‌మేళాలో టెక్ మహేంద్ర, హుండాయ్ మోటార్స్ టాటా ఎలక్ట్రానిక్స్, కేఎస్ సాఫ్ట్‌వేర్, ఫ్లిప్‌కార్ట్, హెటిరో డ్రగ్స్ విప్రోజైన్ ఫ్యాప్ట్, టెక్స్‌విప్ సాఫ్ట్‌వేర్, కియా మోటార్స్ అమరన్ బ్యాటరీస్ తదితర బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీఫార్మసి, ఎంఫార్మసి, బీటెక్, పీజీ చదివిన వారు అర్హులన్నారు. వయసు 18-35 మధ్య ఉండాలన్నారు. ఎంపికయిన వారికి రూ.10వేల నుంచి రూ.50వేలు దాకా జీతం ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారంపై అలసత్వం వద్దు: కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వ్యయప్రయాసల కోర్చి, కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఇచ్చిన అర్జీల పట్ల అధికారులు అలసత్వం వహించకుండా తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 172 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలిచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. జూన్ 5న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో మొక్కల పెంపకానికి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో అతిసార వ్యాధి ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, ఆర్డీవో సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఇతర శాఖల అధికారులు నాగరాజు, శుభదాస్, పద్మావతి, రమణకుమార్, సమత, వెంకటనారాయణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో 70 అర్జీలు..

పుట్టపర్తిరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో 70 అర్జీలు వచ్చాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సత్వరమే విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆదినారాయణ, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

19న కదిరి చైర్‌పర్సన్ ఎన్నిక

కదిరి, మే 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్ల ఎన్నిక ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీలోపు కౌన్సిల్ సభ్యులందరికీ నోటీసులు అందజేయనున్నట్లు వివరించారు. 19వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

వైసీపీ పాపం..! గత ప్రభుత్వంలో రీసర్వే మాటున అన్యాయం

- దళిత రైతులకు 1999లో భూముల పంపిణీ

6

హరోం హర..!

- శివనామస్మరణతో మార్మోగిన కొత్తచెరువు
- వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఉత్సవమూర్తులు (ఇన్‌సెట్)

కొత్తచెరువు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివనామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంగమేశ్వరుడి రథోత్సవం సోమవారం కన్నుల పండువగా సాగింది. గత వారం రోజుల నుంచి స్వామి బ్రహ్మోత్సవాలను కందికేర వంశీకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సంగప్పగారి ఇంటి నుంచి స్వామివారికి ప్రత్యేక పూజా సామగ్రి, జెండాను తీసుకువచ్చి దేవాలయంలో అందించారు. సంగమేశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలకు బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి రథాన్ని ముందుకు లాగారు. ఆలయధర్మకర్తలు మనోహర, నటరాజ్, ఫణి, నాగరాజ్ వారి కుటుంబసభ్యులు తేరువద్దకు చేరుకుని అధిక సంఖ్యలో హాజరైన భక్తులతో కలిసి తేరును లాగారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె పూజలు



రథోత్సవంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని తిలకించారు. పలు సేవాసంస్థలు ఏర్పాటు చేసిన మజ్జిగ, వాటర్, బోజన ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను వారు ప్రారంభించారు.

మూల్యాంకన పైకం ఎప్పుడో..?

- ఉపాధ్యాయుల ఎదురుచూపులు
- అరకొర నిధులతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప (ఫైల్)

ధర్మవరం, మే 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు, మూల్యాంకనం పూర్తయి ఫలితాలు కూడా వచ్చాయి. పరీక్షల నిర్వహణ, స్పాట్ విధుల్లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులకు ఇంత వరకు రెమ్యునరేషన్, అలవెన్సులూ అందలేదు. గతంలో పరీక్షలకు ముందే నిధులు విడుదల చేసేవారు. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటి నుంచి నిధులు విడుదల చేయడంలేదు. దీంతో అధికారులు, వేలాదిమంది ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్, అలవెన్సులు అందించలేకపోతున్నారు. పరీక్షల నిర్వహణ, ఫీజుల వసూళ్లకు ప్రత్యేకంగా పరీక్షల విభాగం పనిచేస్తోంది. ఏడాదిలో ఎన్నో పరీక్షల నిర్వహణ బాధ్యత తీసుకునే ఈ విభాగం.. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు పేరుతో భారీగా వసూళ్లు చేస్తోంది. పరీక్షల నిర్వహణకు ఖర్చు పెట్టడానికి మాత్రం వెనుకడుగువేస్తోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. విధి నిర్వహణలో ఉన్నవారికి చెల్లించే భత్యాన్ని కూడా ఇదే నిధుల నుంచి వెచ్చించాలి. కానీ నిధులను విడుదల చేయడంలో ఆ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. 1000 మంది వరకు స్పాట్ విధుల్లో భాగస్వాములయ్యారు. రోజుకు క్యాంప్ ఆఫీసర్‌కు రూ.495, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.429, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.396, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.300, క్లర్కులకు రూ.132, ఆఫీస్ సబార్డినేట్స్‌కు రూ.83, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లకు రూ.330, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లకు రూ.297 చొప్పున చెల్లిస్తారు. ఒక్కో పేపర్ వాల్యూయేషన్ రూ.10 చొప్పున ఎగ్జామినర్లకు అలవెన్సులు అందిస్తారు. ఇవి కూడా నేటి వరకు చెల్లించలేదు.

అరకొర నిధులతో అవస్థలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వతేదీ వరకు నిర్వహించారు. జిల్లాలో 23,730 మంది పరీక్షలు రాశారు. వీటి నిర్వహణ కోసం కంటింజెన్సీ చార్జీల కింద ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున విద్యాశాఖ అందించాలి. ఆ నిధులతోనే పరీక్షల నిర్వహణకు సీల్, దారం, కట్టర్ ఇతర మెటీరియల్ కొనడంతోపాటు తాగునీరు, ఇతర అవసరాలకు ఖర్చు చేయాలి. ఒక కేంద్రం నుంచి 250 మంది ఉంటే రూ.2500 చెల్లిస్తారు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో విద్యాశాఖ ఇచ్చే కంటింజెన్సీ చార్జీలు ఏ మాత్రం చాలడం లేదని నిర్వాహకులు అంటున్నారు. సీఎస్‌లకు అదనంగా రూ.2వేలు భారం పడుతోందని చీఫ్ సూపరింటెండెంట్లు వాపోతున్నారు. 104 పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు 104 మంది, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 127 మంది, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 23 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరుగురు, సిట్టింగ్ స్క్వాడ్ 40 మందిని నియమించారు. వీరు కాకుండా మరికొంత మంది విధుల్లో ఉన్నారు. నేటికీ బడ్జెట్ విడుదల చేయలేదు. అన్ని ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో కనీస వేతనం కూడా ఇవ్వకపోవడం బాధాకరమని ఉపాధ్యాయులు అంటున్నారు. పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రూ.17, రూ.33, రూ.66 ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనానికి సంబంధించి రెమ్యునరేషన్, అలవెన్సుల బిల్లులు రాలేదు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. నిధులు విడుదల చేస్తామని చెబుతున్నారు. ఎప్పుడు విడుదల చేస్తారన్న దానిపై స్పష్టత రాలేదు.

- లాజర్, జిల్లా పరీక్షల విభాగాధికారి

సత్యసాయి ఆస్పత్రికి నూతన యంత్రం



యంత్రం గురించి వివరిస్తున్న డాక్టర్ వీఆర్ఐఆర్

పుట్టపర్తి, మే 12(ఆంధ్రజ్యోతి): రోగులకు మరింత మెరుగైన సేవలందించడానికి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధునిక ఎకోకార్డియో గ్రాఫిక్ మెషీన్‌ను ఏర్పాటు చేశారు. ప్రశాంతి గ్రామంలోని ఆస్పత్రిలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సోమవారం ఈ మెషీన్‌ను ప్రారంభించారు. కార్డియాలజీ, హెచ్ఓడీ డాక్టర్ వీఆర్అయ్యర్ మెషీన్ ఉపయోగాలను వివరించారు. దాదాపు రూ.3.8 కోట్ల నిధులతో ఆధునిక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ సుందర్‌స్వామినాథన్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి



బుద్ధుడి విగ్రహానికి పూజలు చేస్తున్న బౌద్ధులు

పుట్టపర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో సోమవారం బుద్ధపౌర్ణమి వేడుకలు ఘనం గా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభించారు. సత్యసాయి గ్లోబల్ ట్రస్టు చైర్మన్ చక్రవర్తి, పలువురు బౌద్ధులు బుద్ధుడి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. శ్రీలంక భక్తులు ఆ దేశ సంస్కృతి సంప్రదాయ రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో శ్రీలంక, నేపాల్, జపాన్, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, తైవాన్ తదితర దేశాల భక్తులు పాల్గొన్నారు.



117 రద్దు పేరుతో అశాస్త్రీయ నిర్ణయాలపై ఇటీవల అనంతపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్త స్కూళ్లు.. సరికొత్త సవాళ్లు..!

జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రెండు నెలలుగా విద్యాశాఖ కసరత్తు

చివరి దశకు స్కూళ్ల పునర్నిర్మాణం

జిల్లాలో బేసిక్ ప్రైమరీ 621, మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626..

338 వరకూ ఉన్నత పాఠశాలలు

తగ్గనున్న యూపీ స్కూళ్లు

ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన

పోరాటానికి పిలుపునిచ్చిన కొన్ని సంఘాలు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో స్కూళ్లు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. విద్యాశాఖలో గత ప్రభుత్వం తెచ్చిన 117 జీఓను రద్దు చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్కూళ్ల పునర్నిర్మాణంపై దృష్టిపెట్టారు. రెండు నెలలుగా విద్యాశాఖాధికారులు ఇదే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సీనియారిటీ జాబితాల తయారీ, అభ్యంతరాల స్వీకరణ, వాటి పునఃరూపకల్పన ద్వారా స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ఇదే పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ ప్రక్రియ అంతా కొలిక్కి వచ్చింది. స్కూళ్ల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా టీచర్లు ప్రధానంగా అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలు చాలావరకూ తగ్గనున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626 వరకూ, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 621 వరకూ భారీగానే పురుడు పోసుకోనున్నాయి. హైస్కూళ్లు సైతం 338 వరకూ ఏర్పాటుకానున్నాయి. యూపీ స్కూళ్లు తగ్గనుండడంతో టీచర్లు నష్టపోతారంటూ ఆ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సంఘాల నేతలు ఇప్పటికే ఉద్యమాలకు నడుం బిగించారు. దీంతో కొత్త స్కూళ్ల ఏర్పాటు... విద్యాశాఖలో సరికొత్త సవాళ్లు, సమస్యలకు వేదికగా మారబోతోంది.

జీఓ 117 ముందు పరిస్థితిని యథాతథంగా ఉంచాలి



117 జీఓతో స్కూళ్లు చాలా రకాలుగా నష్టపోయాయి. దానిని రద్దు చేస్తామంటూ కొత్త ప్రభుత్వం సైతం అశాస్త్రీయంగా ముందుకెళ్తుండడాన్ని టీచర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. 117 జీఓ తేవడానికి ముందున్న ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్ల విధానాన్నే అమలు చేస్తే పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అలాకాకుండా కొత్త పేర్లు పెట్టి ఇష్టారాజ్యంగా వర్గీకరణ చేస్తే... అటు టీచర్లు, ఇటు విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుంది.

-జయరాంనాయక్, ఎస్టీఏ జిల్లా అధ్యక్షుడు

పోరాటానికి సిద్ధం

విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు పోరాటాలకు దిగనున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో యూపీ స్కూళ్లు చాలావరకూ తగ్గిపోయే ప్రమాదం ఉండటంతో సంఘాల నేతలు, టీచర్లు మండిపడుతున్నారు. అప్పర్ ప్రైమరీ స్కూళ్లను యథాతథంగా కొనసాగించాలని యూనియన్ నేతలు కోరుతున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకూగానీ, 6 నుంచి 12 వరకూ స్కూళ్లను యథాతథంగా నడపాలని కోరుతున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్లు, 6, 7, 8 క్లాసులు ఉన్నచోట ఆరు స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రైమరీ స్కూళ్లకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండు ఎస్జీటీ పోస్టులను ఉంచాలని కోరుతున్నారు. ప్రతి హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా హెచ్ఎం, పీడీ పోస్టులను కొనసాగించాలని కోరుతున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పీఎస్ హెచ్ఎంలను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సబ్జెక్టు టీచర్లను సర్దడం సరికాదంటూ మండిపడుతున్నారు. ఎక్కువ రోల్ ఉన్న స్కూళ్లలో రెండు మాధ్యమాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు అనేక వినతులు, ప్రతిపాదనలు చేస్తున్నా.. విద్యాశాఖ నుంచీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో వారు ధర్నాలకు సిద్ధమయ్యారు. ఏపీటీఎఫ్ దశలవారీ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఇతర సంఘాలు సైతం అదే బాట పట్టనున్నాయి.

స్కూళ్ల స్వరూపం మారనుంది ఇలా..

నియోజకవర్గం	ఫౌండేషన్ స్కూళ్లు	బేసిక్ ప్రైమరీ	మోడల్ ప్రైమరీ	యూపీ స్కూళ్లు	హైస్కూళ్లు	మొత్తం
అనంతపురం	5	31	31	0	18	85
గుంతకల్లు	15	77	78	1	30	201
కళ్యాణదుర్గం	15	113	101	17	59	305
రాప్తాడు	10	53	33	1	23	120
రాయదుర్గం	3	60	156	3	74	296
శింగనమల	22	139	70	6	39	276
తాడిపత్రి	13	98	59	14	39	223
ఉరవకొండ	9	50	98	17	56	230
మొత్తం	92	621	626	59	338	1,736



స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖాధికారులు

స్కూల్ అసిస్టెంట్లను యూపీ స్కూళ్లలో ఉంచాలి



స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సర్దుబాటు చేయడం సబబుకాదు. సబ్జెక్టు టీచర్లను అప్పర్ ప్రైమరీ స్కూళ్లలోనే కొనసాగించాలి. స్కూల్ అసిస్టెంట్లు యూపీ స్కూళ్లలో ఉంటేనే బోధన సామర్థ్యాలు పెరుగుతాయి. ప్రతి మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ఒక ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడి పోస్టు కేటాయించాలి. మిగిలిన పీఎస్ హెచ్ఎంలను ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలి.

-నాగేంద్ర, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు

అమర జవాన్‌కు రక్తదానంతో నివాళి

మేము సైతం అంటూ ముందుకు వచ్చిన దంపతులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి

అనంతపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు రక్తదానంతో అనంత ప్రజలు నివాళులర్పించారు. సోమవారం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. తొలుత యుద్ధంలో మరణించిన వీరజవాన్ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మేముసైతం అంటూ వైద్యులు, సిబ్బంది, సాధారణ జనం ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతపురంరూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన రాధమ్మ, రాధాకృష్ణ దంపతులు రక్తదానం చేసి దేశభక్తిని చాటుకున్నారు. రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రక్తదానం చేసిన డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. మనకోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్‌లకు రక్తదానశిబిరంతో అశ్రునివాళులు అర్పించామని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ శిబిరాన్ని పరిశీలించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు హెచ్ఓడీ డాక్టర్ శివశంకరనాయక్‌తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్..! స్నాతకోత్సవానికి రండి

గవర్నర్‌ను ఆహ్వానించిన వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి రావాలంటూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ దంపతులతోపాటు, గవర్నర్ కార్యదర్శి ఐఏఎస్ హరిజవహర్ హాజరవుతారని వీసీ సుదర్శనరావు పేర్కొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానం అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అడుగంటుతున్న జలం

- ఎండిపోతున్న బోరుబావులు
- రూ. లక్షలు ఖర్చుచేసి తడులు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు



పచ్చారుమేకలపల్లి వద్ద ఎండిపోతున్న అరటి పంట



పచ్చారుమేకలపల్లి వద్ద ట్యాంకర్‌తో నిమ్మచెట్లకు నీరు పెడుతున్నరైతు

యాడికి, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు పండ్లతోటల రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పంట రావడం అటుంచితే.. భూగర్భ జలాలు అడుగంటిపోయి చెట్లను కాపాడుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు, రాయలచెరువు, యాడికి, నగరూరు తదితర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో బోరుబావుల్లో నీళ్లు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చేతికి అంది వచ్చిన పంటలను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బోరు వేయాలంటే కనీసం రూ.లక్షకు తక్కువ కాకుండా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. నీళ్లు పడకపోవడంతో పంట నష్టపోవడమే కాక బోరువేయడానికి అవుతున్న ఖర్చును అప్పులుగా మూట కట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో 800 అడుగులు బోరు వేసినా నీళ్లుపడడం లేదని రైతులు అంటున్నారు. విధిలేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొని పంటలను రక్షించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకర్ నీటికి రూ.200 నుంచి రూ. 500 వరకు ఖర్చు చేస్తూ ఎండిపోతున్న పంటలకు తడులు అందిస్తున్నారు. లక్షలకు లక్షలు అప్పులుచేసి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కన్నబిడ్డల కంటే ఎక్కువ ప్రాణంగా పెంచిన చెట్లు కళ్లముందే ఎండిపోవడాన్ని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

దీర్ఘకాలిక పంటలపై ఎక్కువ ప్రభావం

యాడికి మండలంలోని కోనుప్పలపాడు, పచ్చారుమేకలపల్లి, రాయలచెరువు, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో అరటి, నిమ్మపంటలు ఎక్కువగా సాగుచేశారు. మూడు సంవత్సరాల పాటు వచ్చే అరటిపంటకు నీరు ఎక్కువ అవసరం. దీంతో అరకొరగా వస్తున్న నీటితో పంటను కాపాడుకోలేక ఆశ వదిలేసుకుంటున్నారు. నిమ్మ చెట్లకు ఐదు సంవత్సరాల నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయి. పంట దిగుబడులు వచ్చే సమయంలో బోరుబావుల్లో నీళ్లు అడుగంటుతుండడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో నిమ్మరైతులు అవస్థలు పడుతున్నారు. పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు గ్రామాల్లో నిమ్మ రైతులు ట్యాంకర్లతో నీటిని కొని తడులు అందిస్తున్నారు.

800 అడుగులు వేసినా కనిపించని జలం

కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు 780 అడుగుల లోతు వరకు బోరువేసినా నీళ్లుపడలేదు. యాడికికి చెందిన మరో రైతు సుమారు రూ.లక్షకుపైగా ఖర్చుచేసి 550 అడుగుల బోరు వేశాడు. చుక్క నీరు పడలేదు. పచ్చారుమేకలపల్లికి చెందిన ఒక అరటిరైతు 500 అడుగుల లోతు వరకు బోరువేసినా ఫలితం లేదు. ఏడాదికేడాదికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతుండడంతో కొందరు దీర్ఘకాలిక పంటలను సాగుచేయడం మానేశారు. పచ్చారుమేకలపల్లిలో అరటిపంటలో అధిక దిగుబడులు తీసే ఒక రైతు బోరులో నీళ్లు తగ్గిపోవడంతో సాగుని మానేశాడు. స్వల్పకాలిక పంటలు సాగు చేస్తున్నాడు. అరటిపంట ఎక్కువగా సాగు చేసే కేశవరాయునిపేటలో కూడా ఇదే పరిస్థితి.

నీటి తడులకు అవస్థలు

కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు ఎండిపోతుండడం చూసి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పంటలకు నీటితడులు అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉన్న కొందరు రైతులు సమీపాన ఉన్న రైతులకు నీటిని ఉచితంగానే అందిస్తూ ఆదుకుంటున్నారు. అరకొరగా నీరు ఉన్నరైతులు ట్యాంకర్ నీళ్లు రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా పంటలకు నీరు అందించాలంటే లక్షలకు లక్షలు అప్పులుచేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నీళ్లు కొని తడులు ఇస్తున్నా



నాకు రెండు ఎకరాల్లో నిమ్మచెట్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన చెట్లు బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో వాడు పడుతున్నాయి. నిమ్మ చెట్లకు తడులు అందించకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ట్యాంకర్ నీటిని రూ.200 కొనుగోలుచేసి తడులను ఇస్తున్నా. గతేడాది కొందరు రైతుల బోరుబావుల్లోనీరు పూర్తిగా తగ్గింది. ఈ ఏడాది మరికొన్ని బోరుబావుల్లో తగ్గాయి. ఏడాదికేడాదికి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

-లక్ష్మీనారాయణ, నిమ్మరైతు, పచ్చారుమేకలపల్లి



నీటి కొరతతో వాడుపడుతున్న నిమ్మచెట్లు



యాడికి వద్ద 600 అడుగులు బోరువేసినా నీళ్లుపడని వైనం

వేసవి వచ్చిందంటే సమస్యే



నేను మూడుఎకరాల్లో నిమ్మచెట్లు సాగుచేశాను. ఎండాకాలం వస్తే బోరుబావుల్లో నీళ్లు పూర్తిగా తగ్గిపోతున్నాయి. చెట్లను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. నీటిని కొని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసుకొని చెట్లకు తడులు అందిస్తున్నా. ప్రతి సంవత్సరం వేసవికాలం వచ్చేసరికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతున్నాయి. కొన్ని బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయి. పంటలను కాపాడుకోవడం చాలా కష్టతరంగా మారింది.

-చలపతి, నిమ్మ రైతు, పచ్చారుమేకలపల్లి

వైసీపీ పాపం..!

దళిత రైతులకు 1999లో భూముల పంపిణీ

గత ప్రభుత్వంలో రీసర్వే మాటున అన్యాయం



శింగనమల తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న నిదనవాడ దళిత రైతులు (ఫైల్)

- సర్వే చేయకుండానే మిగులు భూమిగా నమోదు
- జీవనాధారం కోల్పోతున్న అన్నదాతలు
- అధికారులకు వినతులు
- పట్టించుకునే వారు కరువు


శింగనమల, మే 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. భూములకు భద్రత అంటూ చేపట్టిన రీసర్వేలో దళిత రైతుల పొట్టకొట్టారు. దాదాపు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మండలంలోని నిదనవాడ గ్రామ దళితులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా చూపారు. ప్రభుత్వమే పంపిణీ చేసి.. ఇన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో దళిత రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆఖరుకు కలెక్టర్‌కు సైతం అర్జీ ఇచ్చారు. అయినా.. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో జీవనాధారం కోల్పోతే ఆత్మహత్యే శరణ్యమని దళిత రైతులు వాపోతున్నారు.

1999లో పంపిణీ..

మండలంలోని నిదనవాడ గ్రామ పరిధి సర్వే నంబర్లు 213, 214లో 20 ఎకరాలుపైగా ప్రభుత్వ భూమి ఉండేది. దానిని గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు ఎకరా నుంచి రెండెకరాల చొప్పున 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భూపంపిణీ చేసింది. ఆ మేరకు డీ పట్టాలు పంపిణీ చేసింది. పాసుపుస్తకాలు ఇచ్చింది. ఆన్‌లైన్ చేయలేదు. అప్పట్నుంచి రైతులు పలురకాల పంటలు సాగుచేసుకుంటున్నారు.

సర్వే చేయకుండానే..

గత వైసీపీ హయాంలో భూములకు భద్రత కల్పిస్తామంటూ రీసర్వే చేపట్టారు. అందులో దళిత రైతులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదు చేశారు. విషయం తెలిసిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. 25 ఏళ్లుగా పంటలు సాగుచేసుకుంటున్న భూములను ఇలా నమోదు చేయడం ఏంటని వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే కూడా చేయకుండానే కార్యాలయంలో కూర్చుని మిగులు భూమిగా నమోదు చేశారని వారు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని బాధిత రైతులు.. అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరోసారి సోమవారం శింగనమల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



గతంలో ఇచ్చిన డీ పట్టా

నేను బతికుండగా ఆన్‌లైన్ చేస్తారో.. లేదో..?



నాకు 1999లో సర్వే నంబరు 214-1ఏలో 1.35 ఎకరాల భూమిని ఇచ్చి, పాసుపుస్తం మంజూరు చేశారు. అప్పట్నుంచి భూమి సాగు చేసుకుంటున్నా. రీసర్వేలో అధికారులు భూమి వద్దకు కూడా రాకుండా ఆన్‌లైన్‌లో మిగులుగా నమోదు చేశారు. దీంతో భూమిని అన్‌లైన్‌లో తొలగించారు. ప్రతి వారం అధికారులకు వినతులు ఇస్తున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. నేను బతికుండగా అన్‌లైన్‌లో అధికారులు నమోదు చేస్తారో.. లేదో..?

-పి.నాగన్న, దళిత రైతు, నిదనవాడ

కలెక్టర్‌కు ఇచ్చినా..



సర్వేనంబరు 213లో 1.89 ఎకరాల భూమికి ప్రభుత్వం పాసుపుస్తకం ఇచ్చింది. మూడేళ్ల క్రితం చేపట్టిన రీసర్వేలో భూమిని అన్‌లైన్ నుంచి తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. తరువాత కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినా.. అన్‌లైన్‌లో ఇంతవరకు నమోదు చేయలేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావట్లేదు.

-పెద్దన్న, దళిత రైతు, నిదనవాడ

ఆత్మహత్యే శరణ్యం



నాకు సర్వే నంబరు 213లో 1.35 ఎకరాల భూమి పంపిణీ చేశారు. పాసుపుస్తకం కూడా మంజూరు చేశారు. రీసర్వే సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో మా భూమిని కొలతలు తీయకనే అన్‌లైన్‌లో తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కరించలేదు. ఈ భూమే మాకు జీవనాధారం. ఇప్పటికైనా అధికారులు భూమిని అన్‌లైన్‌లో నమోదు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

-పూజారి పెద్దన్న, రైతు, నిదనవాడ

సబ్ డివిజన్ చేసి... అన్‌లైన్‌లో నమోదు చేయాలి

మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు 1999లో భూ పంపిణీ చేసి, పాసుపుస్తకాలు మంజూరు చేసిన విషయం వాస్తవమే. రీసర్వే సమయంలో అధికారుల చిన్న తప్పిదంతో అన్‌లైన్‌లో తొలగించి, మిగులు భూములుగా నమోదు చేశారు. దళిత రైతుల భూములను మరలా సర్వే చేయించి, సబ్ డివిజన్ చేసి అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. వెంటనే సర్వే చేసి, రైతులకు సబ్ డివిజన్ చేయిస్తాం.

-సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య కన్నుమూత



ఉరవకొండ,మే12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య (93) బళ్లారి సమీపంలోని కంప్లి కొట్టాలలో సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం వజ్రకరూరు మండల ఛాయాపురం. 1977-79, 1980-84లో రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. ఉరవకొండ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. ఛాయాపురం సర్పంచ్‌గా కూడా పనిచేశారు. ఈయనకు నీటి పారుదల రంగంలో నిష్ణాతుడిగా పేరుంది. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురావాలని పుల్లయ్య ఎంతగానో కృషి చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో మంచి సంబంధాలు ఉండేవి. దీంతో ఉమ్మడి రాష్ట్రం ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పనిచేశారు.

సుదీర్ఘ ప్రస్థానం: మంత్రి కేశవ్

దరూరు పుల్లయ్య రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కొనసాగారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పుల్లయ్య మృతి బాధాకరం

అనంతపురం నెట్‌వర్క్, మే 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం ఎంతగానో బాధించిందని ప్రభుత్వ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లాలో సాగునీటి రంగం అభివృద్ధికి ఆయన ఎంతగానో పరితపించారని గుర్తు చేశారు. ముఖ్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకు ముందుండి బలమైన ఉద్యమాన్ని చేపట్టారన్నారు. దరూరు పుల్లయ్య మరణం జిల్లాకు తీరని లోటని వారు అభిప్రాయపడ్డారు.

● అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో సంతాపం తెలియజేశారు. రాయలసీమలో సాగు, తాగునీటి కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో పుల్లయ్య కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన మరణం జిల్లాకు తీరని లోటన్నారు.

● మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకోసం విశేష కృషి చేసిన పుల్లయ్య చిరస్మరణీయుడన్నారు.

● అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య సేవలు వెలకట్టలేనివి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల తాగునీటి కోసం, హంద్రీనీవా ప్రాజెక్టు సాధన కోసం ఎంతగానో శ్రమించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు కళ్లితండాకి మాజీ సీఎం జగన్

హిందూపురం/సోమందేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో వీర మరణం పొందిన అగ్నివీర్ సైనికుడు మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మంగళవారం కళ్లితండాకి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు గోరంట్ల మండటం కళ్లితండాలో ని వీరజవాన్ నివాసానికి జగన్ చేరుకుంటారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు తిరిగి బయలుదేరి వెళతారన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, మే12(ఆంధ్రజ్యోతి): రైల్వేల నిర్వహణలో సిబ్బంది నిబద్ధత పాటించాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఉదయం సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ.. సేఫ్టీ, మెయింటెనెన్స్ కేటగిరీలోని ఉద్యోగులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉన్నపుడే రైళ్ల నిర్వహణ సమర్థవంతంగా, ప్రమాదరహితంగా ఉంటుందన్నారు. విధినిర్వహణలో చురుగ్గా వ్యవహరించి ప్రమాద పరిస్థితులను గుర్తించి పరిష్కరించడానికి కృషిచేసిన రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ ఆఫ్ ద మంత్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

మెడిసిన్ సీటు పేరుతో మోసం

రూ.3.5లక్షలకు టోకరా... ఏఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



ఏస్పీకి ఫిర్యాదు చేస్తున్న యజ్దానిబాషా

యాడికి, మే12(ఆంధ్రజ్యోతి): మెడిసిన్ సీటు ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.3.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని యడికి మండలకేంద్రానికి చెందిన యజ్దానిబాషా ఏఎస్పీకి ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఏఎస్పీ రమణమూర్తికి ఈమేరకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. యజ్దానిబాషా యాడికిలలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. తన కుమార్తెకు ఫిలిప్పిన్స్‌లో మెడిసిన్ సీటు కోసం 2022-23లో విజయనగరంలోని న్యూవే ఎడ్యుకేషన్ సర్వీసెస్ అనే ప్రైవేట్ ఏజెన్సీని సంప్రదించాడు. వారు మొదటి సంవత్సరం ఫీజు రూ.6.75లక్షలు అవుతుందని తెలిపారు. సీటు కన్ఫర్మ్ కావాలంటే రూ.3.5లక్షలు చెల్లించాలని ఏజెన్సీ వారు చెప్పారు. దీంతో ఆ మొత్తాన్ని ఫోన్ పే ద్వారా ఏజెన్సీ నిర్వాహకులు గణేష్, రామారావులకు చెల్లించాడు. నగదు చెల్లింపునకు సంబంధించి ఏజెన్సీ వారు రసీదులు ఇచ్చారు. అప్పటి నుంచి మెడిసిన్ సీటుపై ఏజెన్సీ నిర్వాహకులను యజ్దానిబాషా ఆరా తీస్తూనే ఉన్నాడు. ఇంకా తరగతులు ప్రారంభం కాలేదని, తరగతులు ప్రారంభమైనపుడు చెబుతామంటూ నిర్వాహకులు కాలయాపన చేస్తూ వచ్చారు. మెడిసిన్ సీటుపై బాధితుడు ఏజెన్సీ నిర్వాహకులపై ఒత్తిడి తీసుకురావడంతో మెడిసిన్ సీటు కన్ఫర్మ్ అయినట్లు లెటర్‌లు పంపించారు. దీనిపై అనుమానం వచ్చిన బాధితుడు ఫిలిప్పిన్స్‌లో మెడిసిన్ సీట్లను ఇప్పించే చెన్నైలోని కన్సల్టెన్సీని సంప్రదించాడు. వారి ద్వారి ఫిలిప్పిన్‌లో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు తన కుమార్తె మెడిసిన్ సీటు కన్ఫర్మేషన్ లెటర్‌ను పంపించాడు. వివరాలు ఆరాతీయించాడు. వారు ఇదంతా ఫేక్ అని తెలపడంతో తాను మోసపోయినట్లు బాషా గ్రహించాడు. దీనిపై న్యూవే ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకులను నిలదీశాడు. దీంతో సంస్థ నిర్వాహకులు తనను బెదిరించారని తెలిపాడు. దీనిపై గతంలో కూడా పోలీసులను ఆశ్రయించినట్లు బాధితుడు వాపోయాడు.

నిశ్శబ్దం..

బోసిపోయిన కళ్లి తండా వీధులు
ఎవరి పనుల్లో వారు నిమగ్నం
అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి అధికారుల ఏర్పాట్లు
రెండురోజుల్లో తండా పేరు మార్పుపై నివేదిక

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): చిన్న తండా రోజూ ఉదయం లేచిన వెంటనే ఎవరి పనులకు వారు వెళ్లేవారు. ఆ గ్రామానికి ఇప్పటి వరకు ఏ రోజూ పదిమంది పోలీసులు వచ్చిందికానీ, కలెక్టర్ వచ్చి అక్కడ కూర్చున్నది కానీ లేదు. మూడు రోజులుగా ఆ తండాలోని మూడు వీధులు పోలీసు బూట్ల చప్పుళ్లు, అధికారుల మకాం, పోలీసు సైరన్, రాష్ట్రస్థాయి అధికారుల వరకు జనంతో కిక్కిరిసింది. ఇందుకు కారణం ఈనెల 8న రాత్రి ఆపరేషన్ సిందూర్‌లో తండాకు చెందిన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందడమే. గోరంట్ల మండలంలోని కళ్లితాండాకు చెందిన శ్రీరామనాయక్, జ్యోతీబాయి దంపతుల ఒక్కగానొక్క కుమారుడైన మురళీనాయక్ అగ్నివీర్‌కు ఎంపికై, దేశ సైన్యంలో చేరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని, వీరమరణం పొందారు. శుక్రవారం ఉదయం జమ్మూ కశ్మీర్ నుంచి ఆర్మీ అధికారులకు ఫోన్‌చేసి, మురళీనాయక్ చనిపోయారని రాష్ట్ర, జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ తండా పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. తెలుగు రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ ప్రాణాలు వదలడంతో రెండు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు స్పందించారు. శనివారం పార్థివ దేహాన్ని బెంగళూరు విమానాశ్రయం నుంచి సైనిక వాహనంలో తీసుకొచ్చారు. అడుగడుగునా అశ్రునివాళులు అర్పించారు. ఆదివారం అంత్యక్రియలకు పెద్దఎత్తున హాజరయ్యారు కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి అనిత, జిల్లా మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, మహా



మురళీనాయక్ ఇంటివద్ద సోమవారం పరిస్థితి

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఉదయ్, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. దీంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు తండాలో అధికారులు, నాయకులు, మురళీనాయక్ స్నేహితులు, బంధువుల పరామర్శతో వీధులన్నీ కిక్కిరిశాయి.

నిశ్శబ్ద వాతావరణం

వీరజవాన్ అంత్యక్రియలు ఆదివారం ముగియడంతో ఆయన బంధువులు, స్నేహితులు స్వగ్రామానికి తిరిగి వెళ్లారు. సోమవారం ఒకరిద్దరు నాయకులు పరామర్శించడానికి వచ్చారు. మూడు రోజులుగా కిక్కిరిసిన వీధులన్నీ బోసిపోయిి. ఆదివారం వరకు తండాలో ఏ ఒక్కరూ సొంత పనులకు వెళ్లకుండా మురళీనాయక్ అంత్యక్రియలు ముగిసేవరకు ఇళ్ల వద్దే ఉండిపోయారు. సోమవారం ఎవరి పనులకు వారు వెళ్లడంతో తండా నిశ్శబ్దంగా ఉంది.

అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి ఏర్పాట్లు

అగ్నివీర్ మురళీనాయక్ పార్థివదేహాన్ని ఖననం చేసిన చోట ఘాట్ ఏర్పాటు చేసేందుకు ఆర్మీ అధికారులు సూచనలు ఇచ్చారు. మురళీనాయక్ పార్థివ దేహాన్ని తీసుకొచ్చిన సైనికాధికారులు తండాలోనే మకాం వేశారు. ఇక్కడే ఉండి ఘాట్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని సోమవారం సూచనలు ఇచ్చారు. ఘాట్ 18 అడుగుల పొడవు ఉండాలని సూచించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పనులకు సోమవారం కొలతలు కూడా ఇచ్చారు.

రెండ్రోజుల్లో తండా పేరు మార్పుపై నివేదిక

గోరంట్ల మండలంలోని గడ్డంతండా పంచాయతీ పరిధి కళ్లితండాకు వీరజవాన్ మురళీనాయక్ తండాగా పేరు మార్చాలని సర్పంచ్ వాసుదేవనాయక్‌తోపాటు ఆ పంచాయతీ పరిధిలోని ప్రజలు మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వీరజవాన్ త్యాగానికి ప్రతీకగా కళ్లి తండా పేరును మురళీనాయక్ తండాగా పేరు మార్చాలనీ, అన్ని రికార్డుల్లో మార్చాలని మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించారు. అందుకు తగ్గట్టుగా రెండు రోజుల్లో నివేదికలు.. అధికారులకు పంపనున్నట్లు తెలిసింది.

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నివేదిక పంపుతాం

– వాసుదేవనాయక్, సర్పంచ్, గడ్డంతండా, గోరంట్ల మండలం



మురళీనాయక్ త్యాగానికి ప్రతీకగా, రాబోయే తరాలకు స్ఫూర్తిగా కళ్లి తండా పేరును మురళీనాయక్ తండాగా మార్చాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరాం. ఇందుకు సంబంధించి వినతిపత్రాలు అందించాం. మార్పు చేయడానికి మంత్రి హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో పంచాయతీ కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసి, తండా పేరు మార్పునకు ఆమోదం తెలుపుతాం. ఆ నివేదికను తహసీల్దార్‌కు పంపి, అక్కడి నుంచి ఆర్డీఓ, కలెక్టర్‌కు వెళ్లేలా చేస్తాం. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో వీరజవాన్ కోసం తండా పేరు మార్చడం గర్వంగా ఉంది.

విత్తన సరఫరాపై సందిగ్ధత..!

ఏజెన్సీల నిరాసక్తత
గతేడాది రూ.90 కోట్ల బకాయిలే కారణం
ఉమ్మడి జిల్లాలో 12 ఏజెన్సీలకు టెండర్లు ఖరారు
సేకరణ, ప్రాసెసింగ్ ఆలస్యమైతే నాణ్యతపై ప్రభావం
సబ్సిడీ ధరల ఖరారులోనూ జాప్యం

అనంతపురం అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేయనున్న సబ్సిడీ విత్తన వేరుశనగపై గందరగోళ పరిస్థితి నెలకొంది. గత నెలాఖరులో రాష్ట్ర స్థాయిలో విత్తన సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. అనంతపురం జిల్లాలోని 10 ఏజెన్సీలు, సత్యసాయి జిల్లాలో రెండు ఏజెన్సీలు టెండర్లను దక్కించుకున్నాయి. ఈ నేపథ్యంలో విత్తన సరఫరా బాధ్యతలను అప్పగించేందుకు ఏపీ సీడ్స్ అధికారులు ఆయా ఏజెన్సీల ప్రతినిధులను సంప్రదించగా.. గతేడాది పాత బకాయిలు ఇప్పిస్తే... విత్తన ప్రాసెసింగ్ మొదలు పెడతామని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. దీంతో ఏం చేయాలో తోచని సందిగ్ధంలో అధికార యంత్రాంగం కొట్టుమిట్టాడుతోంది. విత్తన సేకరణతోపాటు ప్రాసెసింగ్ ప్రక్రియ మొదలైతేనే సకాలంలో విత్తన పంపిణీ నిర్వహణ సాధ్యమవుతుంది. ఓ వైపు ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో తక్షణమే విత్తన ప్రాసెసింగ్ మొదలు పెట్టకపోతే నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిలు చెల్లించాలని ఏజెన్సీల పట్టు

గత ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాలు, రబీలో పప్పుశనగ పంపిణీకి సంబంధించి విత్తన ఏజెన్సీలకు రూ.90 కోట్లు నిధులు బకాయిలు ఉన్నాయి. ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తన ఏజెన్సీలకు సరఫరా కేటాయింపులు ఇచ్చి, ఆయా సీజన్లల్లో పంపిణీ చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని 12 ఏజెన్సీలు విత్తన సరఫరా టెండర్లను దక్కించుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయించారు. ఇందులో వేరుశనగ 50,592 క్వింటాళ్లు, వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2,380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు. కేటాయింపుల మేరకు ఏఏ ఏజెన్సీకి ఎంత మోతాదులో విత్తన సరఫరా బాధ్యతలు అప్పగించాలన్న అంశంపై చర్చించేందుకు ఏపీసీడ్స్ అధికారులు ఏజెన్సీల ప్రతినిధులతో సంప్రదించారు. పాత బకాయిలు ఇస్తేనే ఈసారి విత్తన సరఫరా చేస్తామని, లేదంటే చేయలేమంటూ ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. ఏపీ సీడ్స్ ద్వారా విత్తన ఏజెన్సీలకు ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపులోపే విత్తన పంపిణీ సొమ్మును ప్రభుత్వం జమ చేసేది. ఈసారి మే నెల వచ్చినా బకాయిలు జమ చేయకపోవడంతో ఏం చేయాలో తోచని సందిగ్ధంలో ఏపీసీడ్స్ అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు.

సబ్సిడీ ధరల ఖరారులోనూ జాప్యం

ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. జూన్ మొదటి నుంచి సీజన్ ప్రారంభం కానుంది. ముందస్తుగా వర్షాలు పడితే ఖరీఫ్ ప్రారంభంలోనే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలోనే విత్తన సరఫరా ధరలు ఖరారు చేయడంతో మే 1వతేదీ నుంచి వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలు పెట్టారు. గత ఏడాది మే 17న సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. అప్పట్లో మే 18 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మే మూడో వారం నుంచే విత్తన వేరుశనగ పంపిణీ మొదలు పెట్టారు. ఇటీవల టెండర్ల ఖరారు నేపథ్యంలో విత్తన వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93గా ప్రభుత్వం నిర్ణయించింది. సబ్సిడీ ధరలు ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విత్తన సేకరణ, ప్రాసెసింగ్, సబ్సిడీ ధరల ఖరారుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేదంటే పంపిణీపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

ఉపాధ్యాయ ఖాళీలు 7,669..?

పీఎస్ హెచ్ఎం 711.., ఎస్జీటీలు 3392..
ఉమ్మడి జిల్లా లెక్కలు తేలుస్తున్న అధికారులు



ఖాళీలపై కసరత్తు చేస్తున్న హెచ్ఎంలు, ఎంఈఓలు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సు మారు 7,669 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు తేల్చినట్లు సమాచారం. ఐదు, ఎనిమిదేళ్ల పూర్తి చేసుకున్న టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. కంపల్సరీ బదిలీకి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో 3 వేల పైచిలుకు మంది ఉన్నట్టుగా ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. అన్ని రకాల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు రమారమి 7,669గా ఉన్నట్లు ప్రాథమికంగా తేల్చారు. ఇంకా దీనిపై కసరత్తు కొనసాగుతోంది. సోమవారం మరోసారి డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కొందరు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని స్కూళ్లలోని ఖాళీలపై కన్ఫర్మేషన్ తీసుకున్నారు. తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా ఖాళీల గుర్తింపు కొనసాగుతోందనీ, మంగళవారం రాత్రికి క్లారిటీ వస్తుందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

మొత్తం ఖాళీలు 7669...?

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 7,669 టీచర్ పోస్టులు ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు తేల్చారు. మూడు రోజులుగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఇదే పనిలో ఉన్నారు. 63 మండలాల విద్యాధికారులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అనంతపురం రప్పించి ఖాళీలపై కసరత్తు చేయించారు. దాదాపు ఖరారు చేశారు. ఐదు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేస్తున్న టీచర్ల ఖాళీలతోపాటు, పోస్టుల పునర్వ్యవస్థకరణ ఖాళీలు, ఫారిన్ సర్వీస్ వేకెన్సీలు(ఎఫ్ఎస్‌టీవీ), టీచర్ల స్టడీ లీవ్, అనధికార ఆబ్సెంట్ ఖాళీలు ఇలా అన్ని రకాల పోస్టులను గుర్తించారు. ఈ మేరకు ఎంఈఓలు, ఇతర సిబ్బంది డీఈఓ బ్లాగ్‌లో ఖాళీల వివరాలను నమోదు చేశారు. మంగళవారం రాత్రికి ఖాళీలపై స్పష్టత వస్తుందని విద్యాశాఖాధికారుల ద్వారా తెలుస్తోంది.

తాత్కాలిక ఖాళీలు ఇవీ..

పోస్టులు	ఖాళీలు
ప్రైమరీ హెచ్ఎం	711
గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు	157
సెకెండరీ గ్రేడ్ టీచర్లు	3,392
స్కూల్ అసిస్టెంట్(నాన్ లాంగ్వేజెస్)	2,154
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజస్)	1,146
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్	109
మొత్తం	7,669

హంద్రీనీవాపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

వైసీపీ నేతలకు ప్రభుత్వ విప్ కాలవ సవాల్



రాయదుర్గం, మే 12(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిలో ఏ ప్రభుత్వం పాత్ర ఎంతో నిగ్గు తేల్చటానికి బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నేతలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంపెడు మట్టి కూడా తీయలేదన్నారు. ఏమొహం పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులను తప్పు పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజాప్రతినిధులుగా జిల్లాలో అనేక పదవులు చేపట్టి నీటిపారుదలపై అవగాహన ఉన్న ఆ పార్టీనేతలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శివరామిరెడ్డిలు దీనిపై మాట్లాడగలరా అని నిలదీశారు. వారికి దమ్ముంటే 2014 నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వంలో ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారు..? జరిగిన అభివృద్ధి ఎంత అనే విషయంపై బహిరంగ చర్చలో వివరించటానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. 2014 లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేనాటిని 700 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా టీడీపీ అధికారంలోకి వచ్చాక రెండువేల క్యూసెక్కులకు పెంచామన్నారు. 2017 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా 3850 క్యూసెక్కులకు అనుగుణంగా కాలువ విస్తరణ చేపట్టడానికి నిధులు మంజూరు చేశామన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లతో పలుమార్లు ప్రత్యేకంగా చర్చించి పనులు వేగవంతమయ్యేలా శ్రద్ధ పెట్టారన్నారు. 2019 ఎన్నికల నాటికి తమ ప్రభుత్వంలోనే దాదాపు 37 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో జిల్లాలో సమావేశం పెట్టిన జగన్ కాలువను వెడల్పు చేసి 6300 క్యూసెక్కుల ప్రవాహంతో పాటు మరో సమాంతర కాలువను ఏర్పాటు చేయించి పదివేల క్యూసెక్కులు వచ్చేలా చేస్తామని ఉత్తర ప్రగాల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఆ తరువాత పనులు పూర్తిగా ఆపివేశారన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో మళ్లీ పనుల్లో వేగం వచ్చిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రూ. 3700 కోట్లు కేటాయించి పనులు చేస్తుంటే సిగ్గులేకుండా వైసీపీ నేతలు నోరుపారేసుకొంటున్నారని ధ్వజమెత్తారు.

ఎన్టీఆర్ చలువతోనే..

దివంగత నందమూరి తారక రామారావు ఆలోచనల నుంచే హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు పుట్టుకొచ్చాయన్నారు. వెనుకపడ్డ రాయలసీమకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణాజలాలు తరలించడానికి ఆ రోజుల్లో ఆ మహానుభావుడు చేసిన కృషితోనే ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయని వివరించారు.

19 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లను హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బోర్డు వెబ్‌సైట్ www.bse.ap.gov.in నుంచి తమ లాగిన్స్ ద్వారా లేదా మనమిత్ర 9552300009 నెంబర్ ద్వారా డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు హాల్ టికెట్లు అందేలా చూడాలని ఆదేశించారు.

ఆ టీచర్లకు గరిష్ఠ పాయింట్లు కేటాయించాలి

- ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తికాకుండానే రేషనలైజేషన్‌లో పోస్టులు కోల్పోయే ఉపాధ్యాయులకు గరిష్ట పాయింట్లు కేటాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలో సీనియర్ లేదా జూనియర్ టీచర్ ఎవరు హేతుబద్ధీకరణకు గురైనా... ఆ మేరకు పాయింట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు ప్రైమరీ హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. హైస్కూళ్లలో టీచర్, స్టూడెంట్ నిష్పత్తి 1:40గా నిర్ణయించి పోస్టులకు కేటాయించాలన్నారు. బదిలీల సమయంలో పోస్టులు బ్లాక్ చేయరాదని కోరారు. ఇంగ్లీష్ ఇతర సబ్జెక్టు టీచర్ల సీనియారిటీ జాబితాలు ఫైనల్ చేసి సంబంధిత టీచర్లకు ప్రమోషన్లు కల్పించిన తర్వాతే మిగులు టీచర్ పోస్టులు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు సత్యప్రసాద్, అశోక్, వజీర్‌బాషా, నారాయణ, దామోదర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి సోమవారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించారు. ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఈ లలితకుమారితోపాటు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు 48 కేంద్రాల్లో నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 23 కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ నిర్వహించారు. ఉదయం పరీక్షలకు 3,992 మందికిగాను 3,774 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 329 మందికిగాను 317 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 714 మందికిగాను 683 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 119 మందికిగాను 113 మంది హాజరుకాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. పలుచోట్ల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు కన్వీనర్ వెంకటరమణ తెలిపారు.

క్రైం న్యూస్ ..

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి


రజిత (ఫైల్)

నల్లచెరువు(కదిరి), మే12(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన రజిత(25) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండజిల్లా నార్కెట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన రమేష్, భార్య రజితతో కలిసి నల్లచెరువు మండలంలో జరుగుతున్న హంద్రీనీవా విస్తరణ పనులు చేయడానికి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తరువాత ఇద్దరు కొద్దిరోజులు బాగానే ఉన్నారు. కొద్దిరోజులుగా రమేష్ మద్యానికి బానిసై కూలి పనులకు సైతం వెళ్లడం లేదు. దీంతో భార్యభర్తలు గొడపడేవారు. ఈనేపథ్యంలో మనస్తాపం చెందిన రజిత ఈనెల 6న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుట్టు చప్పుడుకాకుండా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మగ్బుల్‌బాషా తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తనకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగి పఠాన్ బషీర్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఇంటిలోని తిండిగింజలు, ఫ్రిజ్, వస్తువులు, నిత్యావసర సరుకులు ఆహుతయ్యాయి. ఆయన భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తిరుపతిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగింది. చుట్టుపక్కల వాళ్లు, బంధువులే ఆ మంటలను ఆర్పివేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ ఆంజనప్ప, వీఆర్‌ఏ సుదర్శన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

సచివాలయంలో చోరీకి యత్నం

నల్లచెరువు (కదిరి), మే 12(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు సచివాలయం-2 భవనంలో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో ఆ సచివాలయం తలుపులను దుండగులు పగలగొట్టారు. అయితే అందులోని ఏ వస్తువును దుండగులు ఎత్తుకెళ్లలేదు. సోమవారం ఈ విషయం గమనించిన సిబ్బంది.. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆ సచివాలయాన్ని పరిశీలించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ మగ్బుల్ బాషా తెలిపారు.

నాటుసారా తయారీదారుల అరెస్ట్

కదిరిఅర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో నాటుసారా తయారు చేస్తూ పోలీసులకు దొరకుండా తప్పించుకుని తిరుగుతున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీధర్ సోమవారం తెలిపారు. అలాగే బాలప్పగారిపల్లి తండా సమీపంలో 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.


ఓడీసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, మే 12(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీని తప్పకుండా గెలిపించుకోవాలని, అప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెంకటసాయి ఐటీఐలో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించడానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు పీట్ల సుధాకర్, జాకీర్, షఫీ పాల్గొన్నారు.

● కన్వీనర్ల ఎంపిక

అమడగూరు (కదిరి): అమడగూరులోని చౌడేశ్వరీ ఆలయంలో టీడీపీ గ్రామ, బూత్ కన్వీనర్లను ఎంపిక చేశారు. ఇందులోఎమ్మెల్యే, మాజీ మంత్రి పాల్గొన్నారు. గ్రామ కమిటీలో పది గ్రామాలకు అధ్యక్షుల ఎంపిక చేశారు. బూత్ కమిటీలో 45 బూత్‌లకు కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎంపిక చేశారు. మండలంలో 15 మంది మండల కన్వీనర్ స్థానానికి పోటీ పడుతుండటంతో ఆ ఎన్నికకు మూహూర్తం కుదరలేదు. పార్టీ అభివృద్ధికి పనిచేసేవారికే పదవులిస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, కాలేనాయక్, ఈశ్వర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, క్రిష్టారెడ్డి, రవి, శీనా, భాస్కర్, కాడా సిద్దు పాల్గొన్నారు.

● నేడు కార్యకర్తల సమావేశం

నల్లమాడ: స్థానిక షాదీమహాల్‌లో మంగళవారం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సిందూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తచెరువు, మే 12(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి.. డీఈఓ కిష్టప్పకు వినతి పత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించకపోతే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, సహాయ అధ్యక్షుడు జీహెచ్‌బాబు, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కదిరిఅర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 1778-1లో ఇళ్లు నిర్మించుకుని వందలాది కుటుంబాలు నివాసముంటున్నాయని, ఆ ప్రాంతంలో విద్యుత్, రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు.. తదితర సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆర్పీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, శేఖర్, స్వప్న, సుగుణమ్మ, రమణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

ధర్మవరం, మే 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20న తలపెట్టిన సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు సోమవారం సమ్మె నోటీస్ అందజేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రెండు రోజుల పాటు సమ్మె చేస్తున్నామని కమిషనర్‌కు విన్నవించారు. ఇందులో సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ముకుంద, నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు పలు సమస్యలు

తనకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ పీజీఆర్‌ఎస్ పలు వినతులు స్వీకరించారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లి సర్వేనెంబర్ 63లో ఉన్న రెవెన్యూ (ప్రభుత్వ) గుట్టలను ప్రైవేటు పరం చేయరాదని వడ్డు మరవపల్లి గ్రామస్థులు వినతిపత్రం అందించారు. అలాగే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్‌కు అనుమతి ఇవ్వాలని కోటపల్లి గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

పరిష్కారమే ఓ సమస్య.!

● వారానికో కార్యాలయంలో పీజీఆర్‌ఎస్
● ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలియక తికమక
● సమాచారం లేక ప్రజలు ఇబ్బందులు
● ఇక ప్రజాసమస్యల పరిష్కారం ఎలా.?

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కార్యక్రమమే ఓ సమస్యగా మారింది. అధికారులు వారానికో కార్యాలయంలో దీన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఈ వారం ఈ కార్యక్రమాన్ని ఎక్కడో నిర్వహిస్తున్నారో తెలుసుకోవడమే ఫిర్యాదుదారులకు ఓ పెద్ద సమస్యగా మారింది.


కదిరి తహసీల్దార్ కార్యాలయంలో మూసివేసిన పీజీఆర్‌ఎస్ భవనం


మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్

కదిరి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) అస్తవ్యస్తంగా తయారైంది. రెవెన్యూ అధికారులు వారానికో కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తుండడం ... ప్రజలకు ఆ సమాచారం ఇవ్వకపోవడంతో ఫిర్యాదుదారులకు ఇదే ఓ పెద్ద సమస్యగా మారింది. ఒక వారం ఎంపీడీఓ కార్యాలయంలో... మరో వారం మున్సిపల్ కార్యాలయంలో దీన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు ఏక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ముందు ఈ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ వారం .. ఏ కార్యాలయంలో... ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. వివిధ శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమాన్ని ఏక్కడ నిర్వహిస్తున్నారో తెలియక అడ్రస్సు తెలుసుకొని ఆ కార్యాలయానికి చేరుకుంటున్నారు.

● పనిచేయని నెట్ పరికరాలు

మొదట తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించేవారు. పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదును ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసి, ఫిర్యాదుదారుడికి రసీదు ఇవ్వాల్సి ఉంది. అయితే మూడు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో నెట్ పరికరాలు పనిచేయడం లేదు. దీంతో ఆ అధికారులు ఏ కార్యాలయంలో నెట్ సౌకర్యముందో అక్కడికెళ్లి తమ విధులు నిర్వహిస్తున్నారు. కొన్నివారాలు ఎంపీడీఓ కార్యాలయంలో, మరి కొన్ని వారాలు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అసలైన తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం నిర్వహించడంలేదు. చాలా మంది ఫిర్యాదుదారులు ఆనవాయితీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి.. నిరాశతో వెనుతిరిగిపోతున్నారు. ఏ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారో తెలీక ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఈ వారం.. కార్యాలయంలో నిర్వహిస్తామని చెప్పే నాథుడే కరువయ్యాడు. అయినా వాటికి ఇంత వరకూ మరమ్మతులు చేయించలేదంటే తహసీల్దార్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది.

● సచివాలయాల్లో లేనట్లేనా.. ?:

గతప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల్లో పలు విభాగాలకు చెందిన కార్యదర్శులున్నారు. రెవెన్యూ అధికారులు మినహాయిస్తే, మిగిలిన వారందరూ ఆయా సచివాలయాల్లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి హాజరయ్యేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయాల్లో పీజీఆర్‌ఎస్ కనిపించడంలేదు. సోమవారం అయినా పలువురు సచివాలయ ఉద్యోగులు కార్యాలయానికి నిర్ణీత సమయంలో రావడం లేదన్న ఆరోపణలున్నాయి. వారు ఫిర్యాదులు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారులు నేరుగా మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ సచివాలయాల్లో కూడా పీజీఆర్‌ఎస్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

తహసీల్దార్ కార్యాయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఫైబర్ నెట్ కనెక్షన్ లేని కారణం ప్రస్తుతం నిర్వహించడంలేదు. తహసీల్దార్ ఇతర కార్యాలయాలకు పీజీఆర్‌ఎస్‌కు వెళ్లితే తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ వినతపత్రాలు తీసుకునేలా చర్యలు తీసుకుంటాం.

\- వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి


పెద్దన్నవారిపల్లిలో విరాళం అందజేస్తున్న నాయకులు

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

కదిరి, మే 12(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలలోని పెద్దన్నవారిపల్లిలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కందివెంకటప్రసాద్ రూ. రెండు లక్షలను విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని సోమవారం ఆ ఆలయ కమిటీ సభ్యులకు టీడీపీ కన్వీనర్ ముబారక్, నాయకులు పూల విజయారెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డి అందించారు.

సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

పుట్టపర్తిరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగసంఘాలు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేసు, ఆఫీసు బేరర్స్ జీఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, శ్రీదేవి, సౌభాగ్య, సాంబశివ, జిల్లా నాయకులు అంజనేయులు, ఓబిరెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

6న అక్షరాభ్యాసం

ఓబుళదేవరచెరువు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి అయ్యప్ప ఆలయంలో జూన్ 6న అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు తెలిపారు. సోమవారం అందుకు సంబంధించిన పోస్టర్‌ను తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయనతో పాటు తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్, సొసైటీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం ఆవిష్కరించారు.

వేలంపాట నేటికి వాయిదా

కదిరి, మే 12(ఆంధ్రజ్యోతి):స్థానిక దినసరి మార్కెట్ వ్యాపారుల వద్ద గేట్ వసూలు వేలం వాయిదా వేసినట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నిర్వహించిన వేలం పాటకు ఒక్కరు మాత్రమే హాజరయ్యారని, దీంతో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ వేలం వాయిదా వేసినట్లు తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన ర్యాలీ

తనకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్తికోట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమాలపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, మహిళ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, ఆరోగ్య కార్యకర్త గంగాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కిశోర బాలికలు, తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ముదిగుబ్బ : కొవ్వొత్తులతో ఏబీపల్లి తండా వాసుల ర్యాలీ

వీర జవాన్‌కు ఘన నివాళి

ధర్మవరం, మే 12(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎస్పీ నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఈ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బూదెప్ప, సుధాకర్, కోదండరాముడు, పూజారి పెద్దన్న, టైలర్ రామకృష్ణ, కేశవ, ఆశాద నరసింహులు, గజ్జల నరసింహులు, సన్నీ, ప్రత్యూష పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : పాకిస్థాన్ దాడిలో వీర మరణం చెందిన జవాన్ మురళీ నాయక్ ఆత్మ శాంతించాలని సోమవారం రాత్రి ఏబీపల్లి తండా వాసులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ధర్మవరంరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని పోతుకుంట గ్రామంలో సోమవారం నిర్వహించారు. సీడీపీఓ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ.. పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతులు ఆన్‌లైన్ వేధింపులకు గురవుతుంటే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. ఎవరినుంచైనా ప్రమాదం పొంచి ఉన్న అనుమానం కలిగితే వెంటనే సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీనెంబర్ 1930కి ఫోన్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప, సూపర్‌వైజర్ అరుణ, కౌన్సిలర్ శివలత, యూత్ అంబాసిడర్ సంజీవరాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీవోల పర్యవేక్షణలో రీసర్వేలు: జేసీ

పుట్టపర్తిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వేలను సంబంధిత ఆర్డీవోల పర్యవేక్షణలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లా డుతూ.. జిల్లాలో మొదటి విడతగా పైలెట్ ప్రాజెక్టు కింద 32 గ్రామాల్లో, రెండో విడత 23 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామన్నారు. ఈ రీసర్వే పనులను ఆర్డీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భూవివాదాలకు సంబంధించిన అర్జీలను క్షేత్రస్థా యిలో పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మొలకల పౌర్ణమి

తాడిమర్రి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో సోమవారం మొలకల పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల క్రితం గ్రామంలోని రామాలయం వద్ద రైతులు నవధాన్యాలను వేశారు. సోమవారానికి మొలకలు రావడంతో వాటిని మహిళలు మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగించారు. సత్యసాయి నీటి సరఫరా విభాగం వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. అనంతరం గ్రామస్థులకు సాయంత్రం భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. చిల్లకొండయ్యపల్లిలోనూ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

● ముదిగుబ్బ : మండలంలోని ఈదులపల్లి గ్రామంలో సోమవారం మొలకల పున్నమి పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులు మొలకల గంపలను గ్రామదేవత గంగమ్మ గుడి వద్ద నుంచి గ్రామ పొలిమేరలో ఉన్న ఊరి బావి వరకు డప్పులతో ఊరేగింపు గా తీసుకెళ్లారు.

● ధర్మవరంరూరల్ : వసంతపురంలో సోమవారం మొలకలపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు చిన్నారులను సంప్రదాయ దుస్తులతో అలంకరించి మొలకలకు పూజలు చేసి ఊరేగింపుగా చెరువువద్దకు తీసుకెళ్లారు. మొలకలను చెరువులోకి వేసి పూజలు చేశారు.

● గాండ్లపెంట : మండలంలో మొలకల పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తూపల్లి పంచాయతీలోని మునగలవారిపల్లి చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చెన్నకేశవ ఆలయం నుంచి గొడగుల మెరవన, కత్తిసాము కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవరెద్దు సమాధి చుట్టు బండ్లమెరవన కార్యక్రమం చేశారు. అలాగే మల్లమీదపల్లి పంచాయతీలోని కోటూరు గ్రామంలో గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు.


తాడిమర్రి : చిల్లకొండయ్యపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న బాలికలు



ముదిగుబ్బ మండలం ఈదులపల్లి, ధర్మవరం మండలం వసంతపురంలో మొలకల ఊరేగింపు

ఆధ్యాత్మికం..


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి వేడుకల్లో భాగంగా శ్రీసత్యసాయి గిరి ప్రదక్షిణను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు గణేశ్ గేటు వద్దసత్యసాయి రథానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, ఎనుములపల్లి సర్కిల్, పెట్రోల్ బంక్, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురం రోడ్డు మీదుగా సాగి తిరిగి గణేశ్ గేటు వద్ద ముగించారు.

హంసవాహనంపై ఊరేగిన శ్రీవారు



ధర్మవరం, మే 12(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవా ల్లో భాగంగా తొమ్మిదవ రోజైన సోమవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు పుష్పమండపంపై ఊరేగించారు. 10 గంటలకు వసంతోత్సవం, అనంతరం చక్రస్నానం చేశారు. సాయంత్రం 6 గంటలకు హంసవాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు, అన్నమయ్య సేవామండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



అలంకరణలో అమ్మవారు, హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

తాడిమర్రి,మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. చౌడేశ్వరి దేవి కలిశాలు, గణపతి ప్రార్థన, మహాకలిశాధారణ, ద్వారాతోరణం, ధ్వజస్తంభ ఆరాధన నిర్వహించారు. సాయంత్రం మహాకుంభ ఉద్వాసన, చాయాదర్శనం నిర్వహించారు. మహామంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భువనేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, కపిల్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తిక్కయ్యస్వామి ఆరాధనోత్సవాలు



ధర్మవరంరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురంలో తిక్కయ్యస్వామి ఆరాధనోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి సిద్దయ్య స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామంలో స్వామివారు జీవసమాధి కావడంతో ఏటా మొలకల పౌర్ణమికి సమారాధన పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్రను కళాకారులతో నాటికప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయకమిటీ ధర్మకర్త తరుణ్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ నాగానందరెడ్డి , గ్రామస్థులు పాల్గొన్నారు.



అమ్మవారికి సిద్ధలు

నంబులపూలకుంట, మే 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో యల్లమ్మ తిరునాళ్లలో భాగంగా మూడో రోజైన సోమవారం సిద్ధలు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పుట్టకు పూజ చేసిన తరువాత పుట్టమట్టితో ఆలయం ముందు సిద్ధలు (పొంగళ్లు) తయారు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రాత్రికి అమ్మవారికి అలంకరణ చేశారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి జ్యోతులు బోనాల సమర్పణ ఉంటుందని పూజారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బుద్ధ పౌర్ణమి


బుద్ధుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న సభ్యులు

ధర్మవరం, మే 12(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుని పౌర్ణమి సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని బుద్ధుడి విగ్రహానికి సోమవారం పలువురు పూజలు నిర్వహించారు. యోగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు నిగ్రహశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మీ, అధ్యాపకులు వనిత, సీనియర్ అసిస్టెంట్ మునిస్వామినాయుడు పాల్గొన్నారు.

● రమణ మహర్షి ఆశ్రమంలో..

ధర్మవరం : స్థానిక మార్కెట్‌యార్డ్ సమీపంలోని రమణ మహర్షి ఆశ్రమంలో సోమవారం ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి.. ఆవు నెయ్యితో దీపాన్ని వెలిగించారు. గోమాతకు పూజలు చేశారు. భక్తులు సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

ధర్మవరం, మే12(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఎదుట ఉన్న అన్నమయ్య విగ్రహం వద్ద అన్నమయ్య సేవా మండలి ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ మండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయ్య, శిష్యులు గోవిందరాజు, నాగార్జున, మల్లికార్జున, పోతిరెడ్డి, నరేంద్రరెడ్డి గోవింద నామాలతో నగర సంకీర్తన, అన్నమయ్య కీర్తనల ఆలాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


కీర్తనలు ఆలపిస్తున్న సభ్యులు

న్యూస్ బాక్స్

కనుల పండువగా బ్రహ్మరథోత్సవం



మడకశిర టౌన్, మే12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవ కన్నులపండువగా సాగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి బ్రహ్మరథాన్ని లాగారు. పట్టణం నుంచేకాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్ కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. గోవింద నామస్మరణ మారుమోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీరంగనాథ స్వామి రథోత్సవం

అమరాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేలుబండ గ్రామంలో లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మారేగౌడ్, వీరేష్, నాగరాజు, అర్చకులు శ్రీనివాస్ బట్టార్, సర్పంచ్ వీరన్న, మాజీ సర్పంచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

కాలువపల్లిలో...

రొళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి గ్రామంలో వెలసిన రంగనాథస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారిని వివిధ పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, మే12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిగాంచిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చకులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

'పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి '

సోమందేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు లెక్కచేయకుండా నిర్మాణాలను తొలగించారన్నారు. ఈ నేపథ్యంలో అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, చాంద్‌బాషా, రాజగోపాల్, చీల నారాయణస్వామి లక్ష్మీదేవమ్మ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈరమాళమ్మ జలధి ఉత్సవం

మడకశిర రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఛత్రం పంచాయతీలోని ఈవమాళమ్మదేవత జలధి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కంచిటి వక్కులిగలు ఉత్సవంలో పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పావగడ, మే 12(ఆంధ్రజ్యోతి): నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.


'మానవత్వాన్ని చాటిన గౌతమ బుద్ధుడు'

పావగడ, మే 12(ఆంధ్రజ్యోతి): మనుషుల్లోని మానవత్వాన్ని చాటిచెప్పిన మహాజ్ఞాని గౌతమబుద్ధుడని సర్వధర్మశాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ అన్నారు. సోమవారం తన ఆశ్రమంలో గౌతమబుద్ధుడు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమబుద్ధుడి అడుగుజాడల్లో అందరూ నడవాల్సిన అవసరం ఉందని సూచించారు. అప్పుడే శాంతికి ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం పేద మహిళలకు ఉచితంగా చీరలు, బియ్యం, పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు.

జూదరుల అరెస్ట్

గుడిబండ, మే 12(ఆంధ్రజ్యోతి): జూద కేంద్రాలపై సోమవారం దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.1.28లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో గుడిబండ మండలం సిసిగిరి గ్రామ శివార్లలో దాడులు నిర్వహించారు. 11మంది జూదరులను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.1.28లక్షలు నగదు, 10సెల్‌ఫోన్లు, 6మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

వైద్యాధికారిగా అయేషా తస్లీమా



సోమందేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా అయేషా తస్లీమా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హరికుమార్ సెలవులపై వెళ్లడంతో కొన్ని నెలలుగా వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో అయిషా తస్లీమాను వైద్యాధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడంతో ఆమె విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు స్థానిక వైద్యులు ఓంకార్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గుడిబండ ఎంపీడీఓగా కేశవరెడ్డి



గుడిబండ, మే 12(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ ఎంపీడీఓగా కేశవరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



చిలమత్తూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన తరుణ్ జాతీయహ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తరువన్నామలైలో జరిగిన పోటీల్లో ప్రతిభకనబరచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు



వెంకటశివుడు యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణమూర్తి

పెనుకొండ, మే12(ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా ఎంపికైన వెంకటశివుడు యాదవ్‌ను పెనుకొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కలిశారు. సోమవారం కురుబ కృష్ణమూర్తి, రామచంద్ర తదితరులు అనంతపురంలో వెంకటశివుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వరి రైతులకు తప్పని నష్టాలు

700 ఎకరాల్లో సాగు

క్వింటాల్ రూ.1600కు కొనుగోలు

మద్దతు ధర దక్కక రైతుల గగ్గోలు



రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న దళారులు

పరిగి, మే 12(ఆంధ్రజ్యోతి): పంటలను సాగుచేస్తున్న రైతులు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఒకసారి అతివృష్టి అనుకుంటే మరోమారు అనావృష్టి. ఇలా రైతులకు ఆర్థికంగా దెబ్బమీద దెబ్బపడుతోంది. అతివృష్టి, అనావృష్టి లేవు..పంట దిగుబడి కూడా బాగుందనుకుంటే మద్దతు ధరలేకపోవడం మరో కారణం అవుతోంది. మండలవ్యాప్తంగా దాదాపు 700 ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. పరిగి చెరువు నీటితో పంటను సాగుచేసి దిగుబడి బాగా ఉందనుకుంటే పంట చేతికందే సరికి మద్దతు ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. 2024లో ఖరీఫ్ సీజన్‌లో వరిధాన్యం క్వింటాల్ రూ.3200 పలికితే ఈ సంవత్సరం క్వింటాల్ ధర రూ.1600 పలుకుతోంది. నాలుగు నెలల నుంచి రాత్రింబవళ్లు అని లేకుండా కష్టపడితే పంట చేతికొచ్చే సరికి ఏదోఒక విధంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు అవసరమైన మందులకు, కూలీలకు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే తీరా కోతలు కోసి అమ్మే సమయంలో క్వింటాల్ రూ.1600లకు అడుగుతుంటే బాధపడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. పంటకు చేసిన అప్పులు తీర్చలేక కనీసం వడ్డీలకైనా డబ్బు వస్తుందిలే అనుకుంటే మద్దతు ధర లేకపోవడంతో ఈయేడు కూడా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూములను బీడుగా వదిలేసి బెంగళూరు, ఇతర పట్టణాలకు పనుల కోసం వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. చెరువుల నుంచి నీరు సమృద్ధిగా వస్తుంటే పంట దిగుబడి కూడా బాగా వచ్చి అప్పులుతీరి గట్టెక్కుతామన్న ఆశలు అడియాశలయ్యాయని, ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధరలేక నష్టపోయాం



గత సీజన్‌లో క్వింటాల్ ధర రూ.3200 పలికింది. ఈ ఏడు ఐదెకరాల్లో వరిసాగుచేశాను. పంట తీరా చేతికందే సమయానికి క్వింటాల్ రూ.1600లకు అడుగుతున్నారు. అప్పులకు, వడ్డీలకు, పెట్టుబడులకు గిట్టుబాటుకాక చేతికందినకాటికి అమ్ముకుంటున్నాం.

- శ్రీనివాసులు, రైతు

ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

రైతులు పండించిన వరిధాన్యానికి మద్దతు ధరలేక నష్టపోయారన్న విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. మండల పౌరసరఫరాల శాఖ వద్ద రైతుల గిట్టుబాటు ధరపై చర్చించాలని కోరుతున్నాం.

-నివేదిత, మండల వ్యవసాయాధికారి

వైసీపీ సేవలో దేవదాయ శాఖాధికారి

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా కొంతమంది అధికారులు ఇప్పటికీ వైసీపీ సేవలో తరిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. సోమవారం హిందూపురం మండలంలోని సంతేబిదునూరు గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం జరిగింది. ఈ రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు విచ్చేశారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఎక్కడైనా బ్రహ్మరథోత్సవాలు జరిగితే ఆ కార్యక్రమానికి వెళ్లిన టీడీపీ నాయకులవైపు దేవదాయశాఖ అధికారులు చూడటానికి కూడా జంకేవారు. ఎందుకంటే మూడేళ్ల క్రితం హిందూపురంలో తెలుగుదేశం నాయకుడికి ఆలయంలో శాలువా కప్పారని ఈఓను నానా ఇబ్బందులకు వైసీపీ నాయకులు గురిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఇప్పటికీ ఆ శాఖలో అధికారి వైసీపీ సేవలో తరిస్తున్నట్లు తెలుస్తుంది. సోమవారం సంతేబిదునూరులో జరిగిన బ్రహ్మరథోత్సవానికి వైసీపీ నేత, ఆగ్రోస్ మాజీ చైర్మన్ హాజరుకాగా ఆయనకు ప్రొటోకాల్ స్థాయిలో అక్కడున్న దేవాదాయశాఖ అధికారి సత్కరించి స్వాగతం పలికారు. దీనిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు, ఎండోమెంట్‌శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు అంటున్నారు. సంబంధిత ఇన్‌చార్జి ఈఓ నరసింహరాజ్‌ను వివరణ కోరగా సాధారణ భక్తుల్లాగే వారికి కూడా అవకాశం కల్పించామనీ, ఆ గ్రామంలోని వైసీపీ నాయకులు.. ఆయనకు సన్మానించాలని చెప్పుకొచ్చారు. వైసీపీ నేతలు సన్మానించి వారితో ఫొటోకూడా దిగారు. ఇది ప్రస్తుతం టీడీపీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అవిశ్వాసానికి అధికార, ప్రతిపక్షాలు దూరం

వీగిపోయిన తీర్మానం



ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో ఖాళీగా కౌన్సిల్ హాల్

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్-1 జబీవుల్లాపై టీడీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ సమావేశానికి అధికార ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు హాజరుకాలేదు. హిందూపురం మున్సిపాలిటిలో 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరితోపాటు ఎంపీ. ఎమ్మెల్యే కూడా మున్సిపాలిటీలో వారికి ఓటింగ్ ఉంది. దీంతో మొత్తం సభ్యులు 40 మంది అవుతారు. మున్సిపల్ వైస్ చైర్మన్-1 జబీవుల్లా పదవీకాలం నాలుగేళ్ల పూర్తికావడంతో ఆయనపై అవిశ్వాస తీర్మాణానికి 23 మంది సభ్యుల సంతకాలతో కూడిన వినతిని ఇదివరకే కలెక్టర్‌కు అందజేశారు. అందుకు అనుగుణంగా సోమవారం మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని పెనుకొండ ఆర్డీఓకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సభ్యులందరికీ సోమవారం జరిగే ప్రత్యేక సమావేశంపై ముందుగానే సమాచారం ఇచ్చారు. ఉదయం 11 గంటలకు సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాల్సి ఉంది. 11.03 గంటల వరకు వేచి చూసినా ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో మరోసారి 12 గంటలకు సమావేశాన్ని వాయిదావేశారు. అప్పటికీ సభ్యులు సమావేశానికి హాజరుకాకపోవడంతో ఈ సమావేశంపై నివేదికను కలెక్టర్‌కి పంపుతామని ఆర్డీఓ విలేకరులకు తెలిపి ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే అవిశ్వాస తీర్మానానికి 27 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉంది. కానీ టీడీపీ బలం 22 ఉంది. ఎంపీ, ఎమ్మెల్యేలతో కలుపుకొని 24 ఓట్లు టీడీపీకి ఉన్నాయి. సోమవారం అవిశ్వాస తీర్మానానికి కావాల్సిన బలం లేకపోవడంతో టీడీపీ సభ్యులు కూడా సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ఇక వైసీపీకి చెందిన 10 మంది సభ్యులను వైసీపీ పార్టీ నాయకులు విహారయాత్రకు తీసుకెళ్లగా, మరికొందరు పట్టణంలోనే ఉన్నారు.

రీసర్వేని అడ్డుకున్న రైతులు



అధికారులను అడ్డుకుంటున్న రైతులు

మడకశిర రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యను పరిష్కరించే వరకు భూముల రీ సర్వే చేయవద్దని సీ కొడిగేపల్లి పంచాయతీలోని కేతేపల్లి, నల్లనాయనపల్లి రైతులు సోమవారం అధికారులను అడ్డుకున్నారు. రీసర్వే కోసం వీఆర్‌ఓ, సర్వేయర్ తదితరులు భూముల వద్దకు వెళ్లగా రైతులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం 1200 ఎకరాల భూములను పరిశ్రమల కోసం కొనుగోలు చేశారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని తమ భూములను తీసుకున్నారన్నారు. ఇప్పటికీ పరిశ్రమలను స్థాపించలేదన్నారు. దీంతో తామే భూములను సాగుచేసుకుంటున్నామని, ప్రస్తుతం రీ సర్వే చేస్తే తమకు సమస్య అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి ఆ తరువాత రీ సర్వే పనులు చేపట్టాలని సీ కొడిగేపల్లి రైతు సీఆర్ వెంకటరంగారెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి కోరారు. కాగా రీసర్వే నిలుపుదల చేయాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవని, ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులతో చర్చించుకోవాలని, తాము తమ పనిచేస్తామని సర్వేయర్ మోహన్‌కుమార్ తెలిపారు.

ఆర్డీటీని పరిరక్షించండి: జేఏసీ

మడకశిర టౌన్, మే12(ఆంధ్రజ్యోతి): ఆర్డీసీ పేదవారికి అండగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధికి బాటలు వేసిందని జేఏసీ నాయకులు శివరామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు, ఆర్డీటీని పరిరక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు, కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగార్జున, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ఓ గ్రామంలో విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కియ పోలీసులు సోమవారం రాత్రి తెలిపారు. ఆ గ్రామానికి చెందిన విద్యార్థిని విజయవాడలో డిప్లొమో చదువుతోంది. సెలవులు కావడంతో గ్రామానికి వచ్చింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కూతురు కనిపించడంలేదని తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుడిబండలో ర్యాలీ

గుడిబండ, మే 12(ఆంధ్రజ్యోతి): అమరజవాన్ మురళినాయక్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని గుడిబండ గ్రామ పంచాయతీ సర్పంచ్ కరుణాకర్‌గౌడ్ అన్నారు. మురళినాయక్‌కు మద్దతుగా వైసీపీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్‌వద్ద పెనుకొండ ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.1.08లక్షలు విలువచేసే 24బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున 4గంటలకు వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం పట్టుబడినట్లు తెలిపారు. కారు వదిలి ఒక వ్యక్తి పారిపోయాడని, అతనికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్, సల్మాన్‌రాజు, రమేష్, కానిస్టేబుళ్లు హరిప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారన్నారు.

వీరజవాన్ కుటుంబానికి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మురళినాయక్ కుటుంబాన్ని మాజీ మంత్రి శైలజానాథ్ పరామర్శించారు. సోమవారం కళ్లితండాకు వెళ్లిన ఆయన మురళినాయక్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి అనంతరం వారి తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కడప, చిత్తూరు నుంచి వచ్చిన వివిధ పార్టీల నాయకులు మురళినాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. సత్యసాయిజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఎంహెచ్ ఇనాయతుల్లా తదితరులు నివాళులు అర్పించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

చిలమత్తూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుమాకులపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి ఆర్డీటీ సంస్థ ప్రతినిధులతోపాటు ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర సోమవారం భూమి పూజ చేశారు. ఆర్డీటీ సూచనతో హుందాయ్ కార్ల సంస్థ రూ. 22 లక్షలతో నూతన భవనం నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, టెక్నికల్ డైరెక్టర్ భావనారాయణ, జయచంద్ర, సీడీపీఓ శాంతి, సూపర్‌వైజర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పుణ్యవతి తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు పురం విద్యార్థిని ఎంపిక



మదిహా

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో బీకాం ఫస్టియర్ చదువుతున్న మదిహా అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని మంగళూరులో ఎనుపమో విశ్వ విద్యాలయంలో ఈనెల 15, 16తేదీల్లో ఐకాన్ యూత్-2025పేరుతో రెండ్రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైందన్నారు. భారత ప్రభుత్వం యువజన సర్వీసులు, కేంద్రమంత్రిత్వశాఖ సహకారంతో జరుగుతున్న ఈ వేదికలో ఆధునిక యుగంలో ప్రజాఆరోగ్య ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించడంలో యువత పాత్ర అనే అంశంపై ఈ విద్యార్థిని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా పోస్టర్ ప్రజెంటేషన్ రూపంలో ప్రసంగించనున్నారని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యకు

శాశ్వత పరిష్కారం చూపుతా

- మంత్రి సవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కాలనీ సమీపంలో గత వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన నివాసాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం కాలనీవాసులు తీవ్ర తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని పార్టీ కార్యాలయంలో మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలనలో తండ్రి పేరుమీద కాలనీలు ఏర్పాటుచేసి కనీసం అక్కడ నెలకొన్న సమస్యలను కూడా పరిష్కరించలేదన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి పెనుకొండకు వలసపక్షులు వచ్చి దోచుకెళ్తుంటారని వారికి ప్రజాసమస్యలు పట్టవన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, కన్వీనర్ శ్రీరాములు, కృష్ణమూర్తి, కౌన్సిలర్ శశి, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు జన్మదినాన్ని మంత్రి సవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం కేక్‌కట్‌చేసి నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని కల్వర్టు



ఇరిగేపల్లి వద్ద దెబ్బతిన్న కల్వర్టు

అగళి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరిగేపల్లి గ్రామం వద్ద కల్వర్టు తెగిపోయి సంవత్సరాలు గడిచినా నేటికీ మరమ్మతులు చేపట్టలేదని టీడీపీ స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కల్వర్టు తెగిపోయిందని, అయితే నేటికీ మరమ్మతులు చేపట్టలేదని వాపోయారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. అగళి నుంచి శిరకు బస్సు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా హైవేకు పోవాల్సిందేనన్నారు. అనుమనపల్లి గ్రామం వద్ద కూడా కల్వర్టు తెగిపోయిందన్నారు. ఈ కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టైర్ పగిలి బొలెరో వాహనం బోల్తా



బోల్తాపడిన వాహనం, రోడ్డుపై పడిన అరటి గెలలు

అగళి, మే 12(ఆంధ్రజ్యోతి): బొలేరో వాహనం టైరు పగిలి బోల్తాపడింది. పులివెందుల నుంచి కర్ణాటకలోని టిప్టూరుకు సోమవారం అరటికాయలు లోడింగ్ చేసుకుని వెళ్తుండగా సత్యసాయిజిల్లా అగళి మండలం రామనపల్లి దగ్గర బొలేరో వాహనం టైరు పగిలింది. దీంతో అరటికాయల లోడ్‌తో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. అయితే ఎవరికీ ప్రమాదం జరగలేదు. అరటికాయలు రోడ్డుపైనే పడిపోయాయి.

పాడి రైతులకు చెక్కుల పంపిణీ



పాడి రైతులకు బీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పావగడ, మే 12(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఎమ్మెల్యే వెంకటేశ్ సోమవారం బీమా చెక్కులు పంపిణీ చేశారు. ఓబుళాపురం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాడిపరిశ్రమలో కర్ణాటక రాష్ట్రంలోనే తుమకూరు జిల్లా మొదటిస్థానంలోఉందన్నారు. ప్రతి ఆవుకు రైతులు ఇన్సూరెన్స్ చేయాలన్నారు. అది రైతులకు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు. అనంతరం అక్కడ నిర్మిస్తున్న పాలడెయిరీకి రూ. 5 లక్షల చెక్కును పాల ఉత్పాదకుల సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. అదేవిధంగా గ్యాస్ సిలెండర్ పేలి పనిముట్లు ధ్వంసమైన నూర్‌సా కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్ రవి, పాడి రైతులు హాజరయ్యారు.